క్లుప్తంగా

రూరల్ ఎస్ఐగా బురాన్ షరీఫ్



తెనాలిరూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా షేక్ బురాన్ షరీఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1984లో కానిస్టేబుల్‌గా శాఖలో చేరిన ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో పని చేశారు. 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2015లో ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పని చేస్తున్న ఆయనకు ఎస్ఐగా ప్రమోషన్ ఇచ్చి గుంటూరు జిల్లాకు కేటాయించి రూరల్ ఎస్ఐగా పంపారు. నూతన ఎస్ఐకు సిబ్బంది స్వాగతం పలికారు.

హైస్కూలు విద్యార్థుల క్షేత్ర సందర్శన



తెనాలిరూరల్: క్షేత్ర సందర్శనలో అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో గల టెక్స్‌టైల్స్ విభాగంలోని హ్యాండ్లూమ్స్, కుట్టుమిషన్లు, డైయింగ్ మిషన్ల పని తీరును శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనురాధ పర్యవేక్షణలో లెర్నెట్‌స్కిల్స్ సంస్థ సహకారంతో విద్యార్థులను యూనివర్శిటీకి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో టెక్స్‌టైల్ విభాగం హెచ్‌వోడీ సీహెచ్. గోవర్ధన్ రావు, ఎం. శివ జగదీష్‌కుమార్ టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి విద్యార్థులకు పలు వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు వృత్తి విద్యా శిక్షకులు టి. వెంకటేశ్వరమ్మ, ఇ. అమర్నాథ్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్



తెనాలిరూరల్: పినపాడులోని మండల్ లెవల్ స్టాక్ పాయింట్‌ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం ఉన్న స్టాకు, దానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి రేషన్ షాపులకు పంపిణీ చేయాల్సిన సరుకుల వివరాలపై ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 64 షాపులలో 34 షాపులకు సరుకులను పంపామన్నారు. చేసామన్నారు. అలాగే రూరల్ పరిధిలో 46 షాపులకు గాని 34 షాపులకు సరుకులు పంపినట్టు చెప్పారు. ఉన్న స్టాకు, పంపిన సరుకుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిని ఆదేశించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ అధికారిగా రాంప్రసాద్



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ రెవెన్యూ అధికారిగా ఎస్.వి.రాంప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీలో మేనేజర్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్ పద్ధతిలో ఆర్వోగా తెనాలి వచ్చారు. అనంతరం ఆయన కమిషనర్ బండి శేషన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు ఆర్‌వోగా పనిచేసిన సోమశేఖర్‌యాదవ్ గూడూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేనేజర్‌గా వెళ్లారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థి ప్రతిభ



తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గస్థాయిలో అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో గుడిమెట్ల అనురూప్ నోయల్ ప్రథమ స్థానంలో నిలిచాడు. స్థానిక అయితానగర్‌లలోని ఎన్ఎస్ మునిసిపల్ హైస్కూలులో ఈ పోటీలు జరిగాయి. శుక్రవారం కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నోయల్‌ను క్యాంపస్ ఇన్చార్జి సుధాకర్ రెడ్డి, అధ్యాపకబృందం ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పోటీలో తెనాలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాడు.

పూలే సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్: మహిళల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల సేవలు ఎనలేనివని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ అన్నారు. పట్టణంలోని 13వవార్డు ఉప్పూడి రోడ్డులోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గరిజ, కుమారి, చిన్న సముద్రాలు, శివ పాల్గొన్నారు.

పౌరాణిక పద్యనాటక ఆణిముత్యం

- ముస్నంగి జగన్‌కుమార్ మృతి
- ఆయన మధురగానంతో ప్రేక్షకులు సమ్మోహనం
- ఆంజనేయుడి పాత్రలో అద్భుత సంభాషణలు
- ఆగిన అయిదు దశాబ్దాల కళాసేవ



ముస్నంగి జగన్‌కుమార్



ఆంజనేయుడి పాత్రలో ..

తెనాలి: పౌరాణిక పద్య నాటకాల్లోని వివిధ పాత్రల్లో తన గానం, అభినయంతో దశాబ్దాలపాటు ప్రేక్షకులను మైమరపింపజేసిన రంగస్థల కళాకారుడు ముస్నంగి జగన్ కుమార్ (75) తన స్వస్థలమైన కొల్లిపర మండల గ్రామం తూములూరులో గురువారం మృతిచెందారు. ఆయన భార్య రెండేళ్ల క్రితమే మరణించారు. వీరికి కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారులు ఉప్పలపాటి సైదులు, మేరిగ రామలింగేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, కుచ్చెళ్లపాడు ప్రసాద్, కుచ్చళ్లపాడు రమేష్, సీహెచ్ ఫణికుమార్ వంటి కళాకారులు జగన్‌కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం ఆయన అంతిమ సంస్కారాలను కుటుంబసభ్యులు నిర్వర్తించారు.

తూములూరులో ఓ సాధారణ కుటుంబంలో 1950 జనవరి ఒకటిన జన్మించారు జగన్‌కుమార్. యుక్తవయసుకు వచ్చేసరికి, కళల కాణాచి తెనాలి నాటకకళలో వర్ధిల్లుతోంది. సహజంగానే అటుకేసి ఆకర్షితుడయ్యారు. 1975లో బబ్రువాహన నాటకంతో నాటకరంగ ప్రవేశం చేశారు. శభాష్ అన్నారు ప్రేక్షకజనం. తెనాలిలో వడ్లమూడి సూర్యప్రకాశరావు దగ్గర పద్యగానంలో సాధన తీసుకున్నారని చెబుతారు. క్రమంగా ఆయనకు నాటకమే జీవితమైంది. ఆంజనేయుడు, నారదుడు, నక్షత్రకుడు, బిల్వమంగళుడు, అర్జునుడు, బబ్రువాహనుడు పాత్రలో అద్భుతంగా నటించసాగారు. తన మధురగానంతో ఆంధ్రదేశంలోని అగ్రనటుల్లో తానూ ఒకరుగా గుర్తింపును పొందారు. 'వీరి గానం సముద్ర కెరటంలా పైకి లేచి, ప్రేక్షకులను గానలహరిలో ఓలలాడిస్తుంది... సుడిగాలిలా చుట్టుముట్టి పారవశ్యంతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని నేతి పరమేశ్వరశర్మ తన 'నూరేళ్ల తెనాలి గ్రంథస్థలి'లో రాశారు. షణ్ముఖి ఆంజనేయరాజు, పీసపాటి, ఏవీ సుబ్బారావు, చీమకుర్తి నాగేశ్వరరావు వంటి ప్రముఖ రంగస్థల కళాకారులతో వేదికను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లోనూ మన్ననలు పొందారు.

అయిదు దశాబ్దాలకు పైగా నటజీవితంలో రెండున్నర వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. తన సోదరుడు ముస్నంగి భాస్కరరావు హైదరాబాద్‌లో నడుపుతున్న 'కళారాజ్యం' సమాజంలో 'రామభక్త హనుమాన్'లోనూ నటించేవారు. గుమ్మడి గోపాలకృష్ణ శ్రీకృష్ణుడిగా, జగన్‌కుమార్ హనుమంతుడుగా పోటాపోటీగా నటించిన ప్రశంసలను అందుకున్నారు. 'ఆంజనేయుడి పాత్రలో అంత ఆర్తిగా, భక్తిగా డైలాగ్ చెప్పగలిగిన నటుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మరొకరు లేరు' అని రంగస్థల నటుడు మేరిగ రామలింగేశ్వరరావు అన్నారు.

1989లో హైదరాబాద్‌లో భారీ సన్మానం జరిగింది. ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు వీరిని సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో రెండు పర్యాయాలు వీరిని నంది అవార్డు వరించింది. 2003లో హైదరాబాద్‌లో జరిగిన నంది నాటకపోటీల్లో 'కలియుగ వైకుంఠం' నాటకంలో నటించినందుకు వీరికి ఉత్తమ సహాయనటుడు అవార్డు లభించింది. మళ్లీ 2017లో తెనాలిలో జరిగిన నంది నాటకోత్సవాల్లో నంది బహుమతిని స్వీకరించారు. వీరు డప్పు కళాకారుడు కూడానని స్థానికులు వెల్లడించారు. వీరి మృతితో పౌరాణిక నాటకరంగానికి మరో ఆణిముత్యం దూరమైంది.

రేపు తెనాలిలో మాల మేధావుల రౌండ్‌టేబుల్ సమావేశం



పోస్టరు ఆవిష్కరించిన జేఏసీ నేతలు

తెనాలి: స్థానిక అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీహాలులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న మాల న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యావేత్తలు, పట్టభద్రులు, మేధావుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెనాలి డివిజన్ జేఏసీ నాయకులు కోరారు. అదే కమ్యూనిటీహాలులో శుక్రవారం సాయంత్రం రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టరును ఆవిష్కరించారు. దళిత హక్కుల సేవాసమితి అధ్యక్షుడు బండికళ్ల బుల్లియ్య మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో మాల ఉద్యోగులనే టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు చెప్పారు.

మెడికల్ కౌన్సిల్ ఎస్సీ వర్గీకరణ అమలు ఈ ఏడాది చేయాలని హైకోర్టులో ఎమ్మార్పీఎస్ వేసిన పిటిషన్ ను తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ వ్యతిరేకించారు. తెనాలిలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మందకృష్ణ మాదిగ, మాలలను శత్రువులుగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పు తర్వాత మాలలకు న్యాయం జరిగే విధంగా మాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో నివేదిక వంటి అంశాలను చర్చిస్తామని తెలిపారు.. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఉన్న మాలనాయకులు నామినేట్ పదవుల్లో సపోర్ట్ చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఉన్న మాల కేసులపై పోరాట సమితి నుండి ముగ్గురు న్యాయవాదులు ఉండేలా నిర్ణయంపైనా చర్చిస్తామని అంబేడ్కరిస్టు యాండ్రపాటి అశోక్ కుమార్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరైన మాల అభ్యర్థులను ఎన్నుకొని పోటీలో నిలిపే అంశంపైనా చర్చ ఉంటుందన్నారు. న్యాయవాదులు ఉద్యోగస్తులు, విద్యావేత్తలు, పట్టభద్రులు, మేధావులు, సామాజికవేత్తలు, ఉద్యమకారులు, అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగ పరిరక్షణ వాదులు, మానవతావాదులు పాల్గొని సలహాలు సూచనలు ఇవ్వవలసిందిగా కోరారు. కారుమంచి రవికుమార్, పిల్లి వాసు, కనపర్తి అబ్రహం లింకన్, కంచర్ల కోటేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ కనపర్తి సాల్మన్ రాజు, సుందర్ సునీల్, తమనం భూషణం, కారుమంచి సునీల్ సందీప్, బొనిగల ప్రదీప్, కంచర్ల నాగభూషణం పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డేవిడ్ యశ్వంత్, నాగరాజు

తెనాలిఅర్బన్: హార్వేస్ట్ ఇండియా అధినేత బిషప్ కత్తెర సురేష్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సుద్దపల్లి నాగరాజు మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంగలకుదురులోని స్వదార్ హోంలోని అనాథలకు, రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన కేకలను డాక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉన్నం ధర్మారావు, కొమ్ము రాయల్, అత్తోట శ్యామ్, నలుకుర్తి రమేష్, పిడపర్తి రవి, రావూరి సతీష్, మైలా భాను, రావూరి సతీష్, పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో శుక్రవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి విభాగ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజలకు వివిధ రకాల మెసేజ్‌ల ద్వారా మోసపూరితమైన లింకులను పంపుతున్నారని, వాటిని నొక్కడం వల్ల పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఉచితంగా ఇస్తామని మోగిస్తున్నారన్నారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పకూడదని వివరించారు. ఓటీపీల ద్వారా ఖాతాల్లోంచి నగదు మొత్తం దోచుకుంటారని చెప్పారు. విద్యార్థులను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీఈఏ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ విచ్చేసి, భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్ ప్రదర్శించిన ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించారు. భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 27న జన్మించారని, ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచారని, విప్లవం వర్ధిల్లాలి అని నినాదాన్ని ఇచ్చారని వివరించారు. స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజపతిరాయ్ హత్య నేపథ్యంలో ఒక పోలీస్ అధికారిని కాల్చినందుకు భగత్ సింగ్‌ను ఉరి తీశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జాన్‌బాబు, కె.గణేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, డి.రవికుమార్, ఎన్.అశోక్, కె.ఆర్యన్, కె.సరళాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత జాగ్రత్తలు వివరించారు. ఇంటి పరిసరాల్లో దోమల లార్వా ఉన్న నీటిని గుర్తించి, పార బోయించి శుభ్రం చేయించారు.రెండు రోజులకోసారి మంచినీటి కుండలు, బిందెలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. పూలకుండీలు, వాడని కూలర్లలో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు.

నేడు గుర్రం జాషువ జయంతి

తెనాలి: పట్టణానికి చెందిన గుర్రం జాషువ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మహాకవి జాషువ 129వ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్, ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్ శుక్రవారం తెలియజేశారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల జాషువ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. సాయంత్రం 4 గంటలకు పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటయే సభలో జాషువా పద్యగానం ఉంటుందని తెలిపారు. అనంతరం జరిగే సభలో రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి, విశ్రాంత ప్రాసిక్యూటర్లు ఉన్నం యెహెజ్కేలు, పల్నాడు జిల్లా డీపీఎం కారుమూరి అమలకుమారి, పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన కై తేపల్లి షాలేమ్‌రాజు, తెనాలి మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ అత్తోట నాగవేణి పాల్గొంటారని వివరించారు.

ఏడు రోజుల్లో అభ్యంతరాలు తెలపండి

తెనాలిఅర్బన్: మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని ఆర్ఆర్ నగర్ వెళ్ళే గ్రావెల్ రోడ్డును రాకపోకలకు గతం నుంచి వినియోగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్తత్ర ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దానిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థల విషయంలో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉంటే ఏడురోజుల్లో రిజిస్టర్ డాక్యుమెంట్లతో పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అదే విధంగా ఆ స్థలంలో మున్సిపల్ చట్టం 1965లోని 174వ అంశంపై ప్రకారం నోటీసు బోర్డును కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కొలకలూరులో నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

తెనాలిరూరల్: డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ సౌజన్యంతో జొన్నలగడ్డ స్వర్ణముఖి స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ఏబీఎం, ఆర్‌సీఎం చర్చిల ఎదురుగా నిర్వహిస్తున్న శిబిరంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యులచే రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, కంటి సంబంధిత వ్యాధులతో పాటు, షుగర్, బీపీ వంటి వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కొలకలూరు, పరిసర ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నిత్యావసర సరకుల పంపిణీ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి చర్చిలో శుక్రవారం పేదలకు నిత్యావసర సరకులు, బియ్యం పంపిణీ చేశారు. సొసైటీ ఆఫ్ విన్సెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అశోక్, బాలకిషోర్, యేసుప్రసాద్, హృదయరాజు, సైమన్ పాల్గొన్నారు.

తెనాలిలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 16,17, 20, 30 వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వార్డుల్లో మురుగు కాల్వలను బాగు చేయించి స్ప్రెయింగ్, బ్లీచింగ్ చల్లారు. వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, దివి అనిత, కొమ్మర బత్తుని జయపాల్, దేసు యుగంధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీం మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్ సూచన



హెల్ప్‌లైన్ గురించి వివరిస్తున్న లక్ష్మణ్ నందన్

కొల్లిపర: పిల్లలు, విద్యార్థులు గంజాయి, పొగాకు వంటి మత్తుపదార్థాలకు మొబైల్ గేమ్స్‌కు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీం మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్ అన్నారు. రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్(1098)గుంటూరు, ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కులు చైల్డ్‌టోల్‌ఫ్రీ నెంబర్(1098) పై మండలంలోని తూములూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయరత్నరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాకా లక్ష్మణ్ నందన్ విద్యార్థులతో మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించడానికి, అక్షరాస్య శాతాన్ని మరింతగా పెంచడానికి సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడిని వీడిన పిల్లలు లేదా బిక్షాటనలో ఉన్న పిల్లలు ఎవరికైన కనిపిస్తే వెంటనే 1098 కు కాల్ చేసి పూర్తి సమాచారం అందిస్తే అటువంటి వారికి చెందిన తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి వారిని తిరిగి బడికి పోయేందుకు తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. బాలల హక్కులు, చైల్డ్‌టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి, సేవా కార్యక్రమాలను, అవశ్యకతను తెలియజేశారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కడ జరగకుండా చూడాలని, ఎక్కడన్నా జరుగుతున్న బాలల శిశు సంక్షేమ లేదా రెవెన్యూ శాఖకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సమాచారం అందించాలని కోరారు. పాఠశాలలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారిబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఉపాధ్యాయురాలు వారికి అవగాహన కల్పించి, ప్రయోగాత్మకంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలిరూరల్: సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొలకలూరు గ్రామంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చట్టంపై అవగాహన ఉంటే అవసరమైన సమాచారాన్ని సేకరించడం సులువు అవుతుందన్నారు. సరైన పద్ధతిలో దరఖాస్తు చేసుకుంటే అప్పిలేట్ అధికారి వరకు వెళ్లకుండానే కావాల్సిన సమాచారాన్ని సంబంధిత ఉద్యోగి నుండి పొందవచ్చని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి. జయంతి బాబు, మండల వ్యవసాయశాఖ అధికారి జి. ప్రేమ్‌సాగర్, మాట్లాడారు. బుర్రిపాలెం, పెదరావూరు, తేలప్రోలు పంచాయతి కార్యదర్శులు, వీఆర్‌వోలు, వీఏఏలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శుక్రవారాన్ని డ్రైడేగా పాటించండి

తెనాలిఅర్బన్: శుక్రవారాన్ని ప్రతి ఒక్కరూ డ్రైడేగా పాటించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో నాజర్‌పేటలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధులు రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోండి

తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ కోరారు. డొంక రోడ్డులోని ఓ చర్చిలో బీసీజీ వ్యాక్సిన్ పై అవగాహన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి అని ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా సోకుతుందని తెలిపారు. వ్యాక్సిన్‌ను వేయించుకోవడం వలన క్షయను నివారించవచ్చని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు, షుగర్‌తో బాధపడుతున్న వారు టుబాకో అలవాటు ఉన్న వారు గతంలో క్షయ మందులు వాడిన వారు, వారి కుటుంబ సభ్యులు అర్హులని తెలిపారు. పట్టణంలోని అన్ని సచివాలయాల్లో వీటిని వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పాస్టర్ రాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• అనాథకు అంత్యేష్టి సంస్కారం



అనారోగ్యంతో జిల్లా వైద్యశాలలో మృతి చెందిన అనాథకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు శుక్రవారం అంత్యక్రియలను నిర్వహించారు. వివరాలోకి వెళ్ళితే కె.విజయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా వైద్యశాలలో చేరాడు. నాలుగు రోజుల తరువాత అతడు మృతి చెందడంతో త్రీటౌన్ పోలీసులు, 26వ వార్డు కౌన్సిలర్ నూరు ఇస్మాయేల్ ఈ విషయాన్ని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు తెలియజేశారు. అతనికి ఎవరు లేరని, అనాథ అని అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో వారు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు మల్లెల వాసు, బి.పోతురాజు పాల్గొన్నారు. -తెనాలిఅర్బన్

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు వద్ద విజయవాడ చెన్నై రైల్వే ట్రాక్‌పై ట్రైన్‌లోంచి ఓ వ్యక్తి జారిపడి గాయపడిన ఘటన శుక్రవారం జరిగింది. విజయవాడ నుంచి కేరళ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ నుంచి దుగ్గిరాల మండలం చిలువూరు దాటిన తర్వాత ఓ వ్యక్తి జారిపడ్డాడు. అది గమనించిన రైతు కూలీలు గేట్ కీపర్ ప్రకాష్‌కు సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది స్పృహ కోల్పోయి రక్తం మడుగులో క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.